# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




ఆస్ట్రేలియా కాల్పుల నిందితుడు సాజిద్ హైదరాబాద్ వాడే: తెలంగాణ డీజీపీ ప్రకటన


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 167 పేజిలు : 04 వెల రూ. 2 బుధవారం 17 - 12 - 2025


### సోనియా గాంధీతో సమావేశమైన

## సీఎం రేవంత్ రెడ్డి



- ఢిల్లీలో సోనియాను కలిసి విజన్ డాక్యుమెంట్ అందించిన సీఎం రేవంత్ రెడ్డి
- 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ సమర్పణ
- రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చ
- రేవంత్ రెడ్డి దార్శనికతను అభినందించిన సోనియా
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆమెకు అందజేసి, రాష్ట్ర భవిష్యత్ - మిగతా 2 లో

### ఆదివాసీ దేవుళ్ల జోలికొస్తే ఊరుకునేది లేదు



2 లో

- మంత్రి సీతక్క హెచ్చరిక
- రెండు విడతల పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయన్న మంత్రి
- ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటిందన్న సీతక్క
- పూర్తిస్థాయి నిధులు గ్రామాలకు అందాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించినట్లు వెల్లడి

### దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన

## అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా జీహెచ్‌ఎంసీ

- 2,050 చదరపు కిలోమీటర్లకు పెరగనున్న విస్తీర్ణం
- 1.12 కోట్ల నుంచి 1.34 కోట్లకు పెరగనున్న జనాభా
- రెట్టింపు కానున్న కార్పొరేషన్ వార్డుల సంఖ్య
- సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యయనం ఆధారంగా వార్డుల డీలిమిటేషన్‌ను నోటిఫై
- ప్రభుత్వం ప్రజల నుంచి సూచనలను, అభ్యంతరాలను కోరింది
- ఇప్పటివరకు 3,000కి పైగా అభ్యంతరాలు
- అభ్యంతరాలను సమర్పించడానికి నేడు చివరి తేదీ అని వెల్లడించారు





నగర శివారులోని 27 మున్సిపాలిటీలను విలీనం చేయడం ద్వారా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) విస్తీర్ణం, జనాభా పరంగా దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించనుంది. జీహెచ్‌ఎంసీ సరిహద్దులు ప్రస్తుతం ఉన్న 650 చదరపు కిలోమీటర్ల నుంచి 2,050 చదరపు కిలోమీటర్లకు విస్తరిస్తాయి. జనాభా 1.12 కోట్ల నుంచి 1.34 కోట్లకు పెరిగే అవకాశముంది. మున్సిపల్ వార్డుల సంఖ్య రెట్టింపై 300కు చేరుకుంటుంది.పంచాయతీలు, మున్సిపాలిటీలు, చిన్న కార్పొరేషన్లు సహా 27 మున్సిపాలిటీలు విలీనం కావడం వలన జీహెచ్‌ఎంసీ తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌గా - మిగతా 2 లో

### 600 బిలియన్ డాలర్ల సంపదతో

## ఎలాన్ మస్క్ సరికొత్త చరిత్ర

- 600 బిలియన్ డాలర్ల సంపద సాధించిన తొలి వ్యక్తిగా ఎలాన్ మస్క్
- స్పేస్‌ఎక్స్ పబ్లిక్ ఇష్యూకి రానుందన్న వార్తలతో భారీగా పెరిగిన సంపద
- టెస్లా షేర్ల పెరుగుదల, ఎక్స్ఏఐ వెంచర్ కూడా కారణం
- చరిత్రలోనే అత్యంత సంపన్నుడిగా మస్క్ రికార్డు



టెక్ దిగ్గజం, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చరిత్ర సృష్టించారు. 600 బిలియన్ డాలర్ల నికర సంపదను సాధించిన తొలి వ్యక్తిగా ఆయన రికార్డు సృష్టించారు. ఫోర్బ్స్ వెల్లడించిన వివరాల ప్రకారం సోమవారం నాటికి ఆయన ఈ అరుదైన మైలురాయిని అధిగమించారు. ముఖ్యంగా ఆయనకు చెందిన స్పేస్ టెక్నాలజీ సంస్థ 'స్పేస్‌ఎక్స్' త్వరలో పబ్లిక్ ఇష్యూకి రానుందన్న వార్తలే ఈ భారీ పెరుగుదలకు కారణంగా నిలిచాయి. స్పేస్‌ఎక్స్‌ను సుమారు 800 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో పబ్లిక్ లిస్టింగ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని రాయిటర్స్ తన - మిగతా 2 లో

### టీటీడీ కీలక నిర్ణయాలు

## అర్చకుల వేతనం రూ.45 వేలకు పెంపు



- తిరుపతిలో 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణం
- అర్చకులు, ఇతర సిబ్బంది వేతనాల్లో భారీ పెంపు
- ముంబై బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయానికి ఆమోదం
- టీటీడీ విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాసులు, మధ్యాహ్న భోజన పథకం
- రథాలు, ధ్వజస్తంభాల కోసం 100 ఎకరాల్లో దివ్య వృక్షాల పెంపకం

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి భక్తుల సౌకర్యం, సంస్థాగత బలోపేతం లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. తిరుపతిలో 20 ఎకరాల విస్తీర్ణంలో భారీ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించాలని, ముంబైలోని బాంద్రాలో శ్రీవారి ఆలయాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో - మిగతా 2 లో

### ఉపాధి హామీ పథకానికి

## గాంధీ పేరు తొలగింపు



2 లో

- తీవ్రంగా స్పందించిన శశి థరూర్
- ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం కొత్త బిల్లు
- పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగింపు
- నిధుల భారాన్ని రాష్ట్రాలపై మోపేలా కొత్త నిబంధనలు
- ఇది గ్రామీణ పేదలపై దాడి అంటూ విపక్షాల ఆందోళన
- బిల్లును వ్యతిరేకిస్తూ లోక్‌సభలో తీవ్ర నిరసనలు

### పవన్ కల్యాణ్‌ను కలిసిన యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్



2 లో

- విజయవాడ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశం
- ద్వైపాక్షిక సహకారం, అభివృద్ధిపై ఇరుపక్షాల మధ్య చర్చ
- సమావేశంలో పాల్గొన్న అమెరికా ఎంబసీ ప్రతినిధులు

### సంజీవని ప్రాజెక్టు ద్వారా

## డిజిటల్ హెల్త్ రికార్డులు

- వైద్యారోగ్య నిపుణులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్?
- వైద్యారోగ్య రంగంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలు అమలు
- ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రయత్నాలు చేస్తున్నామన్న సీఎం చంద్రబాబు
- వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున పెరగాలన్నారు
- రోగ్య సమస్యల కోసం యోగాతో పాటు నేచురోపతిని ప్రోత్సహించాలని అధికారులకు సీఎం సూచించారు
- రాష్ట్రంలో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలు రూపొందిస్తున్నామని వెల్లడించారు
- సామర్థ్యాల పెంపుతోపాటు ప్రజలకు అత్యున్నత సేవలు అందాలని ఆదేశించారు



సంజీవని ప్రాజెక్టు ద్వారా పౌరులకు డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. తద్వారా పౌరులకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. వైద్యారోగ్య నిపుణుల బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్యారోగ్య రంగంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలు అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రయత్నాలు చేస్తున్నామని చంద్రబాబు వివరించారు.రోగ్య సమస్యల కోసం యోగాతో పాటు నేచురోపతిని ప్రోత్సహించాలని అధికారులకు సీఎం సూచించారు. వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున - మిగతా 2 లో

### 18 నెలలుగా ఏపీలో

## మ్యాజిక్ జరుగుతోంది





- ఆ రహస్యం ఏంటని సీఎంలు అడుగుతున్నారు: మంత్రి నారా లోకేశ్
- భోగాపురం వద్ద జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు
- ప్రపంచ ఏవియేషన్ వర్క్ ఫోర్స్‌లో 25% తెలుగువారే ఉండాలన్నదే లక్ష్యం
- విజన్ ఉన్న నేతలను విజన్ లేనివారు ఎగతాళి చేస్తారన్న లోకేష్
- ఏపీ అభివృద్ధికి మిస్సైల్స్, జీపీఎస్‌గా పనిచేస్తున్నామని వ్యాఖ్య
- ఉచితంగా 136 ఎకరాలు అందించిన మాన్సాస్ ట్రస్ట్

ఆంధ్రప్రదేశ్‌లో ఒక చారిత్రక ఘట్టానికి అంకురార్పణ జరిగిందని, భోగాపురం సమీపంలో ఏర్పాటు కానున్న జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రపంచానికే ఆదర్శంగా నిలవనుందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రపంచ సివిల్ ఏవియేషన్ రంగంలోని వర్క్ ఫోర్స్‌లో 25 శాతం తెలుగువారు ఉండాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని ఆయన స్పష్టం - మిగతా 2 లో

# సంపాదకీయం

## కవితా జ్వాల

జనం కవి జ్వాలాముఖి మనకు భౌతికంగా దూరమై నేటికి 17 సంవత్సరాలు గడిచిపోయాయి. 1938 ఏప్రిల్ 12న హైదరాబాద్ సీతారాంబాగ్‌లో జన్మించిన వీరవల్లి రాఘవాచారి%-% 1965 నుంచి దిగంబరకవి జ్వాలాముఖిగా ప్రసిద్ధుడయ్యారు. వృత్తిరీత్యా 12 సంవత్సరాలు హైస్కూల్ ఉపాధ్యాయునిగా, 24 సంవత్సరాలు కళాశాల లెక్చరర్‌గా ఉన్నారు. కవిగా, మహావక్తగా, విరసం, జనసాహితి వ్యవస్థాపక నాయకులలో ఒకరిగా, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ, గ్రామీణ పేదల సంఘంలో చురుకైన కార్యశీలిగా, భారత్%-%చైనా మిత్రమండలి కేంద్ర నాయకునిగా చిర ప్రతిష్ఠను పొందారు.ఆయన పేరు, ఆ కవితాస్ఫూర్తి, ఆ విప్లవ వాగ్వైభవం ఇప్పటికీ సజీవంగా జ్వలిస్తూ, చైతన్యాన్ని రగిలిస్తూనే ఉన్నాయి. రోజులు గడుస్తున్న కొద్దీ, పరిస్థితులు మరింత దిగజారుతూ ఆయన రచనలు, భావాలు మరింత ఎక్కువ ప్రాసంగికతను సంతరించుకుంటున్నాయి. ఆయన కవిత్వాన్ని లోతుగా పరిశీలించవలసిన ఆవశ్యకత, వాటికి తిరిగి ప్రాచుర్యం కలిగించవలసిన అవసరం అధికమవుతున్నది. జన విప్లవ విజయం పట్ల విశ్వాసం, మంచి భవిష్యత్తును నిర్మించుకోగలమనే అపారమైన నమ్మకం ఆయన సాహిత్యానికి ఆయువు పట్టు. ఒక రకమైన నిర్వేదం, నిరాశ సమాజాన్ని కమ్ముకుంటున్న వేళ ఆయన సాహిత్యాన్ని తిరిగి చదువుకోవటం మనలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది. ఉద్యమాల తప్పిదాలను సరిచేసుకునే దృష్టిని కలిగిస్తుంది. అందుకే ఈనాడు ఆయన కవితల ప్రస్తావన విప్లవాభిమానుల తలపులలోకొస్తున్నది.జ్వాల తన కవితాయానపు తొలి రోజుల్లో (1958) రాసిన 'మనిషీ' దీర్ఘకవితకు పెద్దల ప్రశంసలు లభించాయి. "నీ కవిత్వం మానవత్వంలో నవత్వం/ నీ నవత్వం మానవత్వంలో కవిత్వం/ ఫలిస్తుంది బాలమునీ నీ తపస్సు" అని కరుణశ్రీ తన ఆశీస్సులు అందజేశారు. దాశరథి "శ్రీ వీరవెల్లి రాఘవాచార్యుల గేయాలు చూశాను. అభ్యాసంతో బాగా మెరుగెక్కగలవిగా కనిపిస్తున్నాయి. ఈ గేయాల్లో విద్యున్మాలలు ఉన్నాయి" అని ప్రోత్సహించారు. ఆ సమయంలో 'వీరా' పేరుతో ఆయన కొన్ని పాటలు, మహా ప్రభాత గేయాలు రాశారు. 1957లోనే "రాకపోతుందా – ఆకలి ఆర్భటిలో కూటికి ప్రాకులాడే కూలీ యుగము రాకపోతుందా", "రక్త కొలనులో మానవత్వపు సహస్రదళ సౌగంధిక సురభిళ పుష్పం వికసించకపోతుందా?" అని మరో దీర్ఘకవిత రాశారు. ఆ దశలోని ఆలోచనా ధోరణికి ప్రతీకగా మనం మనిషీ కావ్యాన్ని గ్రహించవచ్చు. ఆ తరువాత దిగంబర కవుల మూడు సంపుటాలు (దిక్కులు), 'ఓటమి తిరుగుబాటు' కవితాసంపుటిబీ ఆటవిక న్యాయాన్ని తలపించే ఉరిశిక్షకు ఆధునిక కాలంలో స్థానం ఉండకూడదని, అది రద్దుకావాలని కోరుకునే మానవీయ మకరంద భావాల స్వరం 'వేలాడిన మందారం' నవలబీ 'కాళ్ళు చేతులు ఆడిస్తే ఒడ్డుకు వస్తవు, తలవంచితే మునిగిపోతవు. ఈత ఎట్లా తెగించి నేర్చుకున్నవో గట్లనే బతుకు నేర్చుకో' అన్న జీవన చలనసూత్రాలను నేర్పించే జ్వాల కథల సంకలనం 'కథాజ్వాల'బీ మత విద్వేష కల్లోలంలో ఎగిసిన రసార్ద్ర జ్వాల, శోషిత స్వప్నాల విచలిత దుఃఖగానం భస్మ సింహాసనం (మూడు దీర్ఘకవితల సంకలనం)బీ వైరుధ్యాల మధ్య సంఘర్షణల ద్వారా పొందిన భావ పరిణామ వికాస ప్రతిఫలనం, జ్వాలాముఖి సుదీర్ఘ కవితాయానం కవితాజ్వాలబీ "అన్ని పరిణామాలకు కర్తలు, భర్తలు భారత శ్రామికులు. వాళ్ళు రాజకీయ విప్లవాలకెలా నాయకులో విప్లవ సాహిత్యానికి కూడా అలానే నాయకులు" అని గుర్తించి, వారు సృష్టించిన ఎర్రని మైలురాళ్లకు ప్రతిధ్వనిగా వినిపించిన కొన్ని ఉపన్యాసాల, వ్యాసాల సంకలనం వ్యాస జ్వాల, ఈవరకే తెలుగు సాహిత్యంలో మేలు ఆనవాళ్లుగా నిలిచాయి. ఆయన అనువాదం చేసిన 'దేశదిమ్మరి ప్రవక్త శరత్‌బాబు, రాంగేయ రాఘవ జీవిత చరిత్ర'లను కేంద్ర సాహిత్య అకాడమి గతంలో ప్రచురించింది.జ్వాల జీవన సహచరి శ్రీమతి సీతాదేవి ఈ ఏడాది సెప్టెంబర్ 15న కన్నుమూశారు. ఆమె జ్వాలాముఖికి ఎంతో వెన్నుదన్నుగా, అక్షరాల సహచరిగా చరించారు. ఆ దంపతుల స్మృతికి నీరాజనంగా జ్వాల కవితా సంకలనమైన 'కవితా జ్వాల'ను జ్వాల ప్రచురణలు మరోమారు ముద్రించి కొత్తతరం పాఠకులకు అందిస్తున్నది.

## సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు



**మొదటిపేజీ తరువాయి** – పెరగాలన్నారు. రాష్ట్రంలో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. అనారోగ్యం పాలయ్యాక ఆస్పత్రుల చుట్టూ తిరిగే కంటే ముందస్తుగానే వాటిని నియంత్రించేలా ప్రివెంటివ్ టెక్నాలజీస్‌పై దృష్టి పెట్టాలని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతీ రంగంలోనూ టెక్నాలజీ ద్వారా అత్యుత్తమ ప్రమాణాలు తీసుకురావాలని సూచించారు. సామర్థ్యాల పెంపుతోపాటు ప్రజలకు అత్యున్నత సేవలు అందాలని ఆదేశించారు. క్వాంటం, ఏఐతో రియల్ టైమ్ డేటా విశ్లేషణ లాంటి వాటి ద్వారా ప్రజలకు సేవలందాలన్నారు. ప్రస్తుతం ఏఐ ద్వారా నాలెడ్జి వ్యవస్థీకృతమైందని తెలిపారు.గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశామని చెప్పారు. రియల్ టైమ్‌లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ద్వారా ఇంటిగ్రేట్ చేస్తున్నట్లు వెల్లడించారు. వివిధ అంశాల్లో పౌరులకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు.ప్రివెంటివ్ వెల్ నెస్, డిజిటల్ ఏఐ ఎనేబుల్డ్ హెల్త్, హెల్త్ ఫైనాన్సింగ్ రిఫార్మ్స్ లాంటి కీలకమైన అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. అనారోగ్యానికి గురైన తర్వాత తీసుకునే జాగ్రత్తల కంటే ఆ జబ్బు రాకుండా ముందస్తుగానే నియంత్రించేలా ప్రివెంటివ్ టెక్నాలజీస్‌పై దృష్టి పెట్టాలన్నారు. తద్వారా వైద్యారోగ్యంపై వ్యయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. వైద్యారోగ్య రంగంలో మరింత వినూత్నంగా ప్రాజెక్టులు చేపట్టేందుకు అత్యున్నత స్థాయి ఎక్స్?పర్ట్ గ్రూప్?లు సలహాలు ఇవ్వాలని కోరారు. ప్రతీ రంగంలోనూ టెక్నాలజీ ద్వారా అత్యుత్తమ ప్రమాణాలు తీసుకురావాలన్నది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సామర్థ్యాల పెంపుతో పాటు ప్రజలకు అత్యున్నత సేవలు అందాలని తేల్చిచెప్పారు.ప్రజారోగ్యం విషయంలో ప్రభుత్వం తీసుకొస్తున్న వివిధ నూతన విధానాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఏపీలో మెరుగైన ప్రజారోగ్య నిర్వహణకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్యారోగ్య రంగంలోని నిపుణులతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సూచించారు. అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షకు హాజరయ్యింది. సలహా బృందంలో యూఎస్? ఏఐడీఎస్? ప్రతినిధి పీటర్ పాయింట్, డబ్ల్యూహెచ్?ఓ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్, ఏఐజీ చైర్మన్ డి.నాగేశ్వర్ రెడ్డి, సింగపూర్ ప్రతినిధి ప్రొఫెసర్ ఇక్? ఇంగ్ టియో, ఆర్తి అహుజా, రిజ్వాన్ కొయిటా, శ్రీకాంత్ నాదముని, గగన్ దీప్ కాంగ్, మార్గరెట్ ఎలిజిబెత్, నిఖిల్ టాండన్, ఇతర వైద్య నిపుణులు ఉన్నారు. ఈ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

## 18 నెలలుగా ఏపీలో మ్యాజిక్ జరుగుతోంది

**మొదటిపేజీ తరువాయి** – చేశారు. విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో జరిగిన కార్యక్రమంలో, మాన్సాస్ ట్రస్ట్ సహకారంతో జీఎంఆర్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) మంత్రి లోకేశ్ సమక్షంలో జరిగింది. భీమిలి మండలం అన్నవరం వద్ద 136.63 ఎకరాల్లో ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీని అభివృద్ధి చేయనున్నారు.ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "ఏపీలో 18 నెలలుగా ఏదో మ్యాజిక్ జరుగుతోందని, దాని రహస్యం ఏంటని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు అడుగుతున్నారు. వారికి నేను చెప్పిన సమాధానం ఒక్కటే. మా దగ్గర మిస్సైల్స్, జీపీఎస్ ఉన్నాయి. అయ్యన్నపాత్రుడు, అశోక్ గజపతిరాజు వంటి అనుభవజ్ఞులైన పెద్దలు మాకు జీపీఎస్‌లా మార్గనిర్దేశం చేస్తుంటే, రామ్మోహన్ నాయుడు, అదితి గజపతిరాజు వంటి యువ నాయకులం మిస్సైల్స్‌లా దూసుకుపోతున్నాం. మేం చరిత్ర సృష్టిస్తున్నాం" అని అన్నారు. విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని తెలిపారు.

**ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ జీఎంఆర్ అధినేత**

జీఎంఆర్ సంస్థల అధినేతను 'ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ'గా అభివర్ణించిన లోకేశ్, ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి, పదో తరగతి ఫెయిల్ అయినా పట్టుదలతో ప్రపంచ స్థాయి పారిశ్రామికవేత్తగా ఎదిగిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. "శంషాబాద్ విమానాశ్రయానికి 5 వేల ఎకరాలు అవసరమా అని ఆనాడు కొందరు ఎగతాళి చేశారు. కానీ చంద్రబాబు గారి దూరదృష్టి వల్లే నేడు హైదరాబాద్‌కు రెండో విమానాశ్రయం అవసరం లేకుండా పోయింది. ఆ ఎయిర్‌పోర్ట్ తెలంగాణ జీడీపీలో 12 శాతం వాటాను అందిస్తోంది. విజన్ ఉన్న నాయకులను, విజన్ లేని వారు ఎప్పుడూ ఎగతాళి చేస్తారు" అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

**మాన్సాస్ ట్రస్ట్ గొప్ప మనసు**

ఈ ప్రాజెక్టుకు మాన్సాస్ ట్రస్ట్ ఉచితంగా భూమిని అందించడాన్ని లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. "ఏవియేషన్ ఎడ్యుసిటీ కోసం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాన్సాస్ భూముల మ్యాప్‌తో ముందుకు వచ్చారు. ప్రపంచ స్థాయి సంస్థ వస్తే ఉచితంగా భూమి ఇస్తామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీసం రూపాయి అయినా తీసుకోవాలని నేను సూచించినా, వారు అంగీకరించలేదు. తమ రక్తంలోనే ఏవియేషన్ ఉందని, సంస్థకు మాన్సాస్ పేరు పెడితే చాలని గొప్ప మనసు చాటుకున్నారు. పూసపాటి వంశీయులు వేలాది ఎకరాలను ప్రజల కోసం దానం చేసిన గొప్ప చరిత్ర వారిది" అని అశోక్ గజపతిరాజు, అదితిలకు కృతజ్ఞతలు తెలిపారు.

**క్లస్టర్ విధానంతో 20 లక్షల ఉద్యోగాలు**

కూటమి ప్రభుత్వం 'ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ' విధానంతో పనిచేస్తుందని లోకేశ్ పునరుద్ఘాటించారు. "చైనా తరహాలో క్లస్టర్ ఆధారిత అభివృద్ధి నమూనాను ఏపీలో అమలు చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 20కి పైగా క్లస్టర్లను అభివృద్ధి చేసి, విద్యను పరిశ్రమలతో అనుసంధానిస్తాం. తద్వారా రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే మా లక్ష్యం" అని వివరించారు. 99 పైసలకే భూములు ఇవ్వడం వల్లే విశాఖకు టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు వచ్చాయని, రాబోయే 100 రోజుల్లో మరో రెండు పెద్ద ఐటీ కంపెనీలు రానున్నాయని తెలిపారు. ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీని కేవలం 12 నెలల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ పి. అశోక్ గజపతిరాజు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ చైర్మన్ జీబీఎస్ రాజు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, అదితి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.




## పవన్ కల్యాణ్‌ను కలిసిన యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్

**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంగళవారం నాడు విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది.ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా వివిధ రంగాల్లో సహకారం, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఇరువురు తమ ఆలోచనలను పంచుకున్నారు. పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరంపై చర్చించినట్లు సమాచారం.ఈ సమావేశంలో లారా విలియమ్స్‌తో పాటు యూఎస్ ఎంబసీకి చెందిన మెరెడిత్ మెట్జలర్, పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ అబ్దుల్ రెహ్మాన్ హబీబ్, పొలిటికల్ స్పెషలిస్ట్ శ్రీమాలి కారి, ఎకనమిక్ స్పెషలిస్ట్ శిబా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. రాజకీయ, ఆర్థిక రంగ నిపుణులు ఈ భేటీలో పాల్గొనడం గమనార్హం.

## టీటీడీ కీలక నిర్ణయాలు... అర్చకుల వేతనం రూ.45 వేలకు పెంపు



**మొదటిపేజీ తరువాయి** – ఈ మేరకు ఆమోదం తెలిపారు.సమావేశం అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియాకు వివరాలు వెల్లడించారు. భక్తుల కోసం తిరుపతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ప్లానింగ్, ఆర్కిటెక్ట్ నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. అదేవిధంగా, ముంబై బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. టీటీడీ ఆలయాల్లోని ధ్వజస్తంభాలు, రథాల తయారీకి అవసరమైన కలప కోసం పలమనేరులో 100 ఎకరాల్లో దివ్య వృక్షాలను పెంచే ప్రతిపాదనకు కూడా ఆమోదముద్ర వేశారు.

**ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట**

ఈ సమావేశంలో టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో పనిచేస్తున్న 62 మంది అర్చకులు, పరిచారకులు, పోటు వర్కర్లు, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్ల వేతనాలను గణనీయంగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం అర్చకుల వేతనాన్ని రూ.25 వేల నుంచి రూ.45 వేలకు, పరిచారకులకు రూ.23,140 నుంచి రూ.30,000కు పెంచారు. పోటు వర్కర్లకు, ప్రసాదం పంపిణీ సిబ్బందికి కూడా వేతనాన్ని రూ.30,000కు పెంచుతూ తీర్మానించారు. శ్రీవారి ఆలయంలో ప్రధాన సన్నిధి యాదవతో పాటు అదనంగా మరో సన్నిధి యాదవ పోస్టు భర్తీకి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**విద్య, వైద్య రంగాలకు ప్రోత్సాహం**

విద్యా, వైద్య రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పాలకమండలి ఆమోదం తెలిపింది. తిరుపతి పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అత్యాధునిక సౌకర్యాల కోసం అదనంగా రూ.48 కోట్లు కేటాయించారు. టీటీడీ ఆధ్వర్యంలోని 31 విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు, ఎస్వీ జూనియర్, ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాలల్లో డేస్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.ఇంజినీరింగ్ విభాగంలో 60 పోస్టుల భర్తీకి, శ్రీవారి పోటులో 18 సూపర్ వైజర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరాలని తీర్మానించారు. తిరుమలలోని రహదారులు, కూడళ్లకు వైష్ణవ పురాణాలు, అన్నమాచార్య సంకీర్తనలలోని శ్రీవారి నామాలను పెట్టేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. తలకోనలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.14.10 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్ణయాలన్నీ భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, టీటీడీని మరింత బలోపేతం చేసేందుకు దోహదపడతాయని ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు.

## 600 బిలియన్ డాలర్ల సంపదతో ఎలాన్ మస్క్ సరికొత్త చరిత్ర

**మొదటిపేజీ తరువాయి** – కథనంలో పేర్కొంది. స్పేస్‌ఎక్స్‌లో మస్క్‌కు దాదాపు 42 శాతం వాటా ఉంది. ఈ వాల్యుయేషన్ ప్రకారం ఒక్క స్పేస్‌ఎక్స్ నుంచే ఆయన సంపదకు 168 బిలియన్ డాలర్లు అదనంగా చేరతాయి. దీంతో సోమవారం నాటికి ఆయన మొత్తం సంపద 677 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ అంచనా వేసింది. గత అక్టోబర్‌లోనే మస్క్ 500 బిలియన్ డాలర్ల మార్క్‌ను దాటిన విషయం తెలిసిందే.మస్క్ సంపద పెరగడానికి టెస్లా, ఎక్స్‌ఏఐ కంపెనీలు కూడా దోహదం చేస్తున్నాయి. టెస్లాలో ఆయనకు 12 శాతం వాటా ఉండగా, ఈ ఏడాది ఆ కంపెనీ షేర్లు 13 శాతం పెరిగాయి. డ్రైవర్ సీటులో సేఫ్టీ మానిటర్ లేకుండా రోబోట్యాక్సీలను పరీక్షిస్తున్నామని మస్క్ ప్రకటించడంతో సోమవారం టెస్లా స్టాక్ దాదాపు 4 శాతం లాభపడింది. మరోవైపు మస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ 'ఎక్స్‌ఏఐ' కూడా 230 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో 15 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణకు చర్చలు జరుపుతోంది. ఈ పరిణామాలపై వ్యాఖ్యానించేందుకు మస్క్, టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్‌ఏఐ సంస్థలు వెంటనే స్పందించలేదని రాయిటర్స్ తెలిపింది.

## ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు తొలగింపు



**మొదటిపేజీ తరువాయి** – మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం సరికొత్త బిల్లును ప్రవేశపెట్టడం లోక్‌సభలో తీవ్ర దుమారానికి దారితీసింది. 'వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు, 2025'ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం సభలో ప్రవేశపెట్టగా, విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి.ఈ బిల్లును కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది గ్రామీణ పేదల సంక్షేమాన్ని దెబ్బతీసే తిరోగమన చర్య అని అభివర్ణించారు. ముఖ్యంగా, పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇది కేవలం పేరు మార్పు కాదని, గాంధీజీ స్ఫూర్తితో వచ్చిన ఈ పథకం తాత్విక పునాదులపై చేసిన దాడి అని ఆరోపించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం, సమాజంలోని చివరి వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆయన ఆశయాలకు ఈ చట్టం ప్రతీక అని గుర్తుచేశారు.కొత్త బిల్లులోని నిధుల కేటాయింపు నిష్పత్తిపైనా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇప్పటివరకు ఉపాధి హామీ పథకంలో అసంఘటిత కార్మికుల వేతనాల భారాన్ని దాదాపుగా కేంద్రమే భరిస్తుండగా, కొత్త విధానంలో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం భరించాలని ప్రతిపాదించారు. దీనివల్ల పేద రాష్ట్రాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని, వేతనాల చెల్లింపులో జాప్యం జరిగి పథకం నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని థరూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.అయితే, ఈ బిల్లు ద్వారా పని దినాలను 100 నుంచి 125కి పెంచుతామని, డిజిటల్ పారదర్శకతను తీసుకొస్తామని ప్రభుత్వం చెబుతోంది. 'వికసిత్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా ఈ పథకాన్ని ఆధునికీకరిస్తున్నట్లు తెలిపింది. మరోవైపు, ఈ బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపాలని ప్రియాంక గాంధీ వాద్రాతో సహా పలువురు విపక్ష నేతలు డిమాండ్ చేశారు. బిల్లుపై చర్చ సందర్భంగా విపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ, సభ నుంచి వాకౌట్ చేయడంతో తీవ్ర గందరగోళం నెలకొంది.

## ఆదివాసీ దేవుళ్ల జోలికొస్తే ఊరుకునేది లేదు



**మొదటిపేజీ తరువాయి** – మా ఆదివాసీ దేవుళ్ల జోలికి వచ్చినా, మా అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా ఊరుకునేది లేదని తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ, సమ్మక్క-సారలమ్మ జాతర, ఆదివాసీ సంస్కృతి, ఆత్మగౌరవంపై తప్పుడు వ్యాఖ్యలు చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఇలాంటి వాటిని తాము సహించేది లేదని స్పష్టం చేశారు. ఇళ్ల విషయంలో బీఆర్ఎస్ నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.తెలంగాణలో రెండు విడతల్లో ఇప్పటి వరకు 8,566 పంచాయతీల్లో ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటిందని ఆమె అన్నారు. గ్రామాలకు పూర్తిస్థాయి నిధులు అందాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి పది ఇళ్లయినా ఇవ్వలేదని బీఆర్ఎస్ పార్టీని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో కొన్ని వేల ఇళ్లను ఇచ్చిందని అన్నారు. మహిళలకు చీరలు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పేద పిల్లలకు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు వస్తే కొందరికి కళ్లమంటగా మారిందని విమర్శించారు. కొంతమంది నీచమైన రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా జీహెచ్ఎంసీ

**మొదటిపేజీ తరువాయి** – మారుతుందని కమిషనర్ ఆర్వీ కర్ణన్ మంగళవారం జీహెచ్ఎంసీ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో తెలిపారు.వార్డుల పునర్విభజన కోసం గత వారం జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్‌పై చర్చించడానికి ఈరోజు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని తమ సూచనలను, అభ్యంతరాలను లేవనెత్తారు.సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యయనం ఆధారంగా వార్డుల డీలిమిటేషన్‌ను నోటిఫై చేసినట్లు కమిషనర్ కర్ణన్ వెల్లడించారు. ప్రభుత్వం ప్రజల నుంచి సూచనలను, అభ్యంతరాలను కోరిందని తెలిపారు. ఆ తర్వాత తుది నోటిఫికేషన్ వస్తుందని అన్నారు. ఇప్పటివరకు 3,000కి పైగా అభ్యంతరాలు వచ్చాయని, అభ్యంతరాలను సమర్పించడానికి నేడు చివరి తేదీ అని వెల్లడించారు.జీహెచ్ఎంసీ విస్తరణ గ్రేటర్ హైదరాబాద్‌కు కొత్త శకాన్ని సూచిస్తుందని, మరిన్ని ప్రాంతాలను ఏకీకృత పాలనలోకి తీసుకువస్తుందని, సమాన అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందుతాయని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు తమ సూచనలు, అభ్యంతరాలను ఇస్తే, వాటిని పరిశీలిస్తామని ఆమె అన్నారు.పార్టీలకు అతీతంగా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు వార్డుల డీలిమిటేషన్‌పై అభ్యంతరాలను లేవనెత్తారు. రాజకీయ పార్టీలు, కార్పొరేటర్లను సంప్రదించకుండానే డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నోటిఫికేషన్ రాజ్యాంగ విరుద్ధమని, జీహెచ్ఎంసీ చట్టాన్ని ఉల్లంఘించేలా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు.అభ్యంతరాలను సమర్పించడానికి గడువును పొడిగించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ విజ్ఞప్తి చేశారు. మజ్లిస్ పార్టీని రాజకీయంగా దెబ్బతీసేందుకు డీలిమిటేషన్ జరుగుతోందని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే అహ్మద్ బలాలా ఆరోపించారు. డీలిమిటేషన్ కోసం అనుసరించిన ప్రమాణాలకు సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని ఆయన కమిషనర్‌ను డిమాండ్ చేశారు.

## సోనియా గాంధీతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి



**మొదటిపేజీ తరువాయి** – ప్రణాళికలను వివరించారు.గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి తీసుకుం టున్న చర్యల గురించి సోనియా గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) తెలిపింది. ఇటీవల డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025' వివరాలను కూడా ఆమెకు తెలిపారు.ఈ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వ పనితీరు, రాష్ట్ర అభివృద్ధిపై రేవంత్ రెడ్డి దార్శనికతను సోనియా గాంధీ అభినందించారు. విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ, ముఖ్యమంత్రికి తన శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఏమిటీ విజన్ డాక్యుమెంట్?**

'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్ ప్రకారం, రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకోవాలని నిర్దేశించుకున్నారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్రాన్ని క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ), ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ), రేర్ (రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ) అనే మూడు ప్రత్యేక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నారు.ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్‌కు సోనియా గాంధీ సందేశం పంపుతూ, తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ఈ సదస్సు ఒక పెద్ద ముందడుగు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# విద్యార్థులు సైబర్ క్రైమ్ ఉచ్చులో పడవద్దు

**ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి**

**సర్దార్ పటేల్ కాలేజీలో సైబర్ క్రైమ్ లపై అవేర్నెస్**



**సికింద్రాబాద్, డిసెంబర్ 16 ( ప్రజామంటలు) :** మొబై ల్ వాడకంలో మెలుకువలు, క్రైమ్ లపై పూర్తి అవగాహన సాధించాల్సిన అవసరం ఉందని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి అన్నారు.విద్యార్థులు యువకులు సైబర్ క్రైమ్ ఉచ్చులో పడవద్దని ఆయన సూచించారు.పద్మారావు నగర్ లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ డిగ్రీ, పీజీ కళాశాలలో సంకల్పం ఎన్జీవో ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి పాల్గొన్న డీసీపీ బాలస్వామి మాట్లాడుతూ.. లోన్ యాప్ ల ద్వారా అనవసరమైన అప్పు లు చేసి యువత అనవసరమైన ఇబ్బందులు పడవద్దని సూచించారు. తెలియని నెంబర్ల నుండి వచ్చే మెసేజ్ లు కాల్ పై అప్రమత్తత అవసరమన్నా రు. విద్యార్థులు తాము అవగాహన చేసుకోవడమే కాకుండా,తమ కుటుంబ సభ్యులను సైబర్ క్రైమ్ లపై పూర్తి అవగాహన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అడిషనల్ డీజీపీ నరసయ్య మాట్లాడుతూ చదువుకునే రోజుల్లోనే మొబైల్స్ కు దూరం ఉండాలని సూచించారు. ఫేక్ అకౌంట్లు అనుచిత కాల్స్ స్వీకరించే విషయంపై పూర్తి అవగాహన తెచ్చుకోవాలని అన్నారు. ఆన్ లైన్ మోసాల ద్వారా అనేక కుటుంబాలు వీధి పాలు పడ్డాయని యువత ఈ విషయంలో సమాజాన్ని జాగృతం చేయవలసిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో సంకల్పం ఎన్జీవో వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ వెంకట్, వ్యవస్థాపక అధ్యక్షు రాలు కల్పన, కళాశాల అధ్యా పకులు, చిలకలగూడ ఇన్స్పెక్టర్ అనుదీప్, ఎస్ఐ రాకేశ్,పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొ న్నారు.

# మూడవ విడత సర్పంచ్ ఎన్నికకు 853 మంది పోలీసులతో భారీ బందోబస్తు:జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల వరకు**

**163 బి ఎన్ ఎస్ ఎస్(144 సెక్షన్ అమలు)**




**జగిత్యాల డిసెంబర్ 15(ప్రజా మంటలు) :** విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదు జిల్లాలో జరగనున్న మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి ఆయా ప్రాంతాలకు ఎన్నికల సామగ్రిని పటిష్ట పోలీస్ బందోబస్త్ మధ్య తరలించడం జరిగిందని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూటు మొబైల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మూడవ విడతకి సంబంధించి జిల్లాలో బుగ్గారం, ధర్మపురి,ఎండపల్లి, గొల్లపల్లి, పెగడపల్లి, వెల్గటూర్ మండలాలలో మొత్తం 119 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని, 45 రూట్స్ లలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ , స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్ మరియు ఎస్.ఐ లతో పెట్రోలింగ్ టీమ్స్ తో మొత్తం 853 మంది పోలీస అధికారులు సిబ్బందిచే ఎన్నికలను ప్రశాంత వాతారణంలో నిర్వహించేదుకు అన్నిరకాల పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఎన్నికలలో పోలీసుల విధి విధానాలపై పోలీస్ అదికారులకు ,సిబ్బందికి దిశానిర్దేశం చేశామని, పౌరుల స్వేచ్ఛకు భంగం కలగకుండా ప్రలోభాలకు తావు లేకుండా ప్రతి ఓటరు తమ ఓటు ను స్వేచ్ఛగా వినియోగించుకునే ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు . ఓటర్లు ఎవ్వరూ కూడా సెల్ ఫోన్ లు, మందుగుండు సామాగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూతు లోనికి తీసుకువెళ్లారాదని, సెల్ఫీలు దిగడం నిషేదం అన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎన్నికల సంఘంచే జారీ చేయబడిన నియమాలను పక్కగా అమలు చేస్తామన్నారు.ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎం సి సి) అమలులో ఉందని కావున విజయోత్సవ ర్యాలీలు, బాణసంచాలు కాల్చడం, బైక్ ర్యాలీలు, డీజే లు వంటి కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం అన్నారు. ఎం సి సి అమల్లో ఉన్నందున ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఎన్నికల నిర్వహణ వ్యవస్థ

**స్వేచ్ఛాయుత ఎన్నికలు సాధ్యమేనా**

**మద్యం డబ్బు పంపిణీ అరికట్టడంలో అధికారులు విఫలం**

**ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు**

**ఎల్కతుర్తి డిసెంబర్ 16 ప్రజా మంటలు :** గ్రామీణ స్వరాజ్యాన్ని నెలకొల్పేందుకు జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పారదర్శకత ఓటర్లకు స్వేచ్ఛాయుత పరిస్థితులు లేకుండా పోయాయని ధర్మ సమాజ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఒక ప్రకటన ద్వారా విమర్శించారు నేడు తెలంగాణ గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మద్యం ఏరులై పారుతున్న అభ్యర్థులు ఓటర్లకు ఒకరికి మించి ఒకరు డబ్బులు అధికంగా పంపిణీ చేస్తుంటే వాటిని అరికట్టడంలో రాష్ట్ర ఎన్నికల సంస్థ రాష్ట్ర పోలీసు విభాగం ఘోరంగా విఫలమవుతున్నట్టుగా నిరూపణ అవుతుంది రాజ్యాంగ సంస్థలను సైతం నిర్వీర్యం చేయడం గమనార్హం అని అన్నారు. ఎన్నికల్లో ఏరులై పారుతున్న మద్యం ఓటు కొనుగోలు కోసం డబ్బుల పంపిణీ మూలంగా నీతి నిజాయితీ కలిగిన ఉన్నత ఆశయాలతో రాజకీయాల్లో రాణించాలని వస్తున్న అతి సామాన్యమైన యువతకు అవరోదులుగా మారి వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ గ్రామాన ఓటు యొక్క విలువను శక్తిని తెలియజేయడంలో విఫలమవుతున్నట్టు స్పష్టంగా అర్థం అవుతుంది ఎన్నికల నిర్వహణ చూస్తే గ్రామాల్లో విష సంస్కృతి నాటుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రతి సామాన్యుడు సింహాసనం మీద కూర్చునేలా ప్రభుత్వ పాలన వ్యవస్థ ఉండాలని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రౌండ్ టేబుల్ సమావేశాల్లో నిర్ణయాత్మక వయస్సు వచ్చే ప్రతి వ్యక్తికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు ఉండాలని మహా పోరాటం చేసి బీసీ ఎస్సీ ఎస్టీ అందరికీ ఓటు హక్కు సాధించి పెట్టారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఇప్పటికీ గ్రామాల్లో ప్రజలకు ఓటు యొక్క విలువశక్తి తెలియజేస్తూ ఎన్నికల్లో మద్యం డబ్బు పంపిణీ చేయడాన్ని అరికట్టడంలో ప్రభుత్వ వ్యవస్థలన్నీ విఫలమవుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యం నిర్వీర్యం అవుతుందని ఈ సందర్భంగా బొంకూరి దరాజు అన్నారు.




## కస్తూర్బా విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన

**పరీక్షల ఒత్తిడికి చెక్**

**స్ట్రెస్ మేనేజ్మెంట్పై డా. ప్రహసిత్ ఉపన్యాసం**



**భీమదేవరపల్లి డిసెంబర్ 16 (ప్రజామంటలు) :** మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో డా. ప్రహసిత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, చదువులో ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలపై విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా స్ట్రెస్ మేనేజ్మెంట్, కెరీర్ గైడెన్స్, పరీక్షలకు ఎలా సిద్ధపడాలి, చదివిన విషయాన్ని దీర్ఘకాలంగా ఎలా గుర్తుపెట్టుకోవాలి వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు మానసికంగా ధృడంగా ఉండాలన్నదే విజయానికి కీలకమని డా. ప్రహసిత్ తెలిపారు. అలాగే మానసిక ఒత్తిడి లేదా సమస్యలు ఎదురైనప్పుడు ప్రభుత్వం అందిస్తున్న టెలీ మానస్ 14416 కాల్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డా. రెహ్మాన్, సూపర్వైజర్ మోహన్, పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులు ఈ అవగాహన కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగపడిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## నూతన ప్రజాప్రతినిధులకు మాజీ ఎమ్మెల్యే సత్కారం



**భీమదేవరపల్లి, డిసెంబర్ 16 (ప్రజామంటలు) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన సర్పంచ్ సిక ప్రదీప్, వార్డు సభ్యులు కుమార్, మద్దె రాజు, మ్యాకల బిక్షపతి, రేణుకుంట్ల ఐశ్వర్య మహేందర్ లను అభినందించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు ఐక్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మండల సురేందర్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బోడ వీరస్వామి, పులి వీరస్వామి, రేణుకుంట్ల మహేందర్, తాడూరి అజయ్ గార్లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పోలు మహేందర్, మహిళా శాఖ అధ్యక్షురాలు కాసగోని మానస, కొట్టే జ్యోతి, సీనియర్ నాయకులు రాగం రమేష్, మ్యకల సమ్మయ్య, మంచిల్ల లింగయ్య, మ్యకల మహేందర్, సల్పల రాజయ్య, జక్కుల రాజయ్య, సల్పల సమ్మయ్య, సట్ల కిషన్, మద్దివేని రాజేందర్, ఎల్ల సంపత్, వేల్పుల ప్రతాపు, పులి వెంకట్ రాజు, అప్పని రవీందర్, బోడ రాజమౌళి, గుర్రం సంజీవ్, పోలు సది, తునికి సుమన్, పుంద్ర శ్రీనివాస్ రెడ్డి, రేణిగుంట్ల శ్రీనాథ్, సిక పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి మచ్చ ఓటమి కోపంతో బాలింతపై దాడి

**ఎన్నికల ఓటమి రగిల్చిన కక్ష తల్లి,కూతురిపై దాడి**

**వార్డు మెంబర్ ఓటమితో హింసాత్మక ఘటన**



**శంకరపట్నం డిసెంబర్ 16 (ప్రజామంటలు) :** శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ఓటమి చెందిన వార్డు మెంబర్ కుటుంబ సభ్యులు బాలింతపై దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన దాసరి పద్మ (50), ఆమె కూతురు దాసరి ప్రియాంక (32)పై మీరు మాకు ఓటు వేయలేదని ఆరోపిస్తూ ఓడిపోయిన వార్డు మెంబర్ కుటుంబ సభ్యులు మూకుమ్మడిగా దాసరి మొగిలయ్య ఇంటిపై దాడి చేశారని బాధితులు వాపోయారు. ఈ దాడిలో దాసరి పద్మ, ప్రియాంకలకు గాయాలయ్యాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి, పైలట్ కాజా కలిలుల్లా సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారిని హుజురాబాద్ ఏరియా హాస్పిటల్కు తరలించారు. ఎన్నికల ఓటమిని జీర్ణించుకోలేక ఇలాంటి దాడులకు పాల్పడటం దురదృష్టకరమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితులకు న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు.

## మహిళా న్యాయవాదులకు రిజర్వేషన్ అమలు చేయాలి

**హైకోర్టు ఎదుట మహిళా న్యాయవాదుల ధర్నా**




**సికింద్రాబాద్, డిసెంబర్ 16 ( ప్రజామంటలు) :** 2026 బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు చేయాలంటూ బార్ కౌన్సిల్ తెలంగాణ ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులు మంగళవారం హైకోర్టు గేట్ నంబర్%-%6 ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వి వాంట్ జస్టిస్ నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ అమలుకు బార్ కౌన్సిల్ తెలంగాణ సుప్రీంకోర్టు, బిసిఐలకు లిఖితపూర్వకంగా నో అబ్జెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ జి. సుభాషిని మాట్లాడుతూ... 2024 లోనే రిట్ పిటిషన్ దాఖలైనప్పటికీ, 14ు11%-%-2025న ఇచ్చిన ప్రాతినిధ్యాన్ని పట్టించుకోకుండా డిసెంబర్ 20న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం మహిళలను అణచివేయడమేనన్నారు. 64 ఏళ్లుగా మహిళా న్యాయవాదులకు సముచిత స్థానం కల్పించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. బార్ కౌన్సిల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించి వారి పురోగతికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టి. అరుణకుమారి, జి. శ్రీలత, బండార్ శైలజ, పి. సుమిత్రాదేవి, పర్వత, సఫియా బేగం, లక్క స్వేత, చందన తదితరులు పాల్గొన్నారు.

# ధనుర్మాసం వేళ దేవాలయాలకు దర్శనానికి అద్దెకు ఆర్టిసి బస్సులు

**జగిత్యాల డి. ఎం కే. కల్పన**




**జగిత్యాల డిసెంబర్ 17 (ప్రజా మంటలు)** ధనుర్మాసం ను పురస్కరించుకొని వివిధ దేవాలయాలకు దర్శనానికి వెళ్లే భక్తులకు అద్దె ప్రాతి పదికాన ఆర్టిసి బస్సులను ఇస్తున్నామని ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల డి. ఎం కే. కల్పన అన్నారు. మంగళవారం మీడియా తో మాట్లాడుతూ ధనుర్మాసం ను పురస్కరించుకొని వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయడం కోసం ఈ నేపథ్యంలో భక్తులందరు సమిష్టిగా ఆర్టిసి బస్సును అద్దె కు తీసుకొని దర్శనాలను భద్రంగా చేసుకోవచ్చన్నారు. ఆర్టిసి బస్సులను అద్దెకు తీసుకోవాలని భావించే వారికోసం కొత్త బస్టాండ్ లోని ఎంక్వయిరీ నెంబర్ 9493310269 లో సంప్రదించాలని డి. ఎం. కోరారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల్లో బి ఆర్ఎస్ మద్దతు తో గెలిచిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను అభినందించి సత్కరించిన జిల్లా అధ్యక్షులు మాజీ జెడ్పి చైర్పర్సన్





**జగిత్యాల డిసెంబర్ 15 (ప్రజా మంటలు) :** జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జగిత్యాల నియోజకవర్గం లోని గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డు మెంబర్లను సన్మానించిన జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మరియు జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు ఉప సర్పంచ్ కు వార్డ్ మెంబర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర చాలా ముఖ్యమని అన్నారు. ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా గ్రామపంచాయతీ అకౌంట్లోకి నిధులు వస్తాయని సర్పంచ్ లు మరియు పాలకవర్గ సభ్యులు ఎవరి బెదిరింపులకు భయపడవలసిన అవసరం లేదని అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ అన్ని విధాలుగా నాయకులకు కార్యకర్తలకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా అన్నారు. మళ్లీ రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని మళ్లీ తిరిగి కేసీఆర్ ని ముఖ్యమంత్రిగా చేసే వరకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పట్టణ అధ్యక్షులు సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు వార్డ్ సభ్యులు బిఆర్ ఎస్ సీనియర్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేను జీవన్ రెడ్డికి నమ్మిన బంటును

**జీవన్ రెడ్డికు చెడ్డ పేరు వస్తే అర్ధగంటలో రాజీనామా చేస్తా..జగిత్యాల డిసిసి అధ్యక్షుడు ...గాజంగి నందయ్య**



**జగిత్యాల డిసెంబర్ 15 (ప్రజా మంటలు) :** నావల్ల కాంగ్రెస్ పార్టీకి, జీవన్ రెడ్డికి చెడ్డపేరు వస్తే అర్ధగంటలో రాజీనామా చేస్తా అన్నారు డిసిసి అధ్యక్షులు నందయ్య జగిత్యాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్లకు జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో అభినందన సభ కొనసాగుతుండగా ఎమ్మెల్యే సంజయ్తో నందయ్య సన్నిహితంగా కార్యక్రమాల్లో పాల్గొనడంపై అసంతృప్తి వ్యక్తం చేసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సమక్షంలోనే డీసీసీ అధ్యక్షుడిని ప్రశ్నించిన జీవన్ రెడ్డి వర్గం వారు దీంతో డీసీసీ అధ్యక్షుడు నందయ్య ఆగ్రహం వ్యక్తం చేస్తూ యువజన కాంగ్రెస్ నాయకులు తనపై నమ్మకం ఉంచాలి%ౕ% ఇంకా నాకు ప్రొబేషన్ పీరియడ్ నడుస్తోంది, నా వల్ల జగిత్యాల కాంగ్రెస్కు లేదా జీవన్ రెడ్డికి చెడ్డ పేరు వస్తే అర్ధగంటలో రాజీనామా చేస్తా, అధ్యక్ష పదవి కోసం కక్కుర్తి పడటం లేదన్నారు. .రాజీనామా పత్రం జేబులోనే ఉందనీ, నా పదవి జీవన్ రెడ్డి ఇచ్చిన భిక్షం ఆయనకు నందయ్య అంటే నమ్మిన బంటు అనే పేరు ఉందన్నారు, లూజ్ కామెంట్స్ చేయొద్దు%ౕ% ఇష్టం లేకపోతే ఇదే స్టేజ్పై రాజీనామా చేసి వెళ్తా అన్నారు డిసిసి అధ్యక్షులు, జీవన్ రెడ్డి అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్లను, ఈ పదవి ఉన్నా ఒకటే, పోయినా ఒకటే అన్నారు.

## వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు ఘనంగా పత్రిక లిఖనం



**భీమదేవరపల్లి డిసెంబర్ 16 (ప్రజామంటలు) :** ధనుర్మాస ఆరంభాన్ని పురస్కరించుకుని శ్రీ కొత్తకొండ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి బ్రహ్మోత్స వాలకు సంబంధించిన పత్రిక లిఖన కార్యక్రమం శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. మకర సంక్రాంతి పర్వదినాన అత్యంత వైభవోపేతంగా జరగనున్న బ్రహ్మోత్సవాల నిర్వహణకు నెల ముందుగానే ధనుర్మాసంలో ఈ ఆరంభ క్రతువును ఆలయ సంప్రదాయాల ప్రకారం చేపట్టారు. ఈ సందర్భంగా గణపతి పూజ, శైవశుద్ధి, పుణ్యాహవాచనం నిర్వహించి, అనంతరం ప్రదక్షిణ క్రమంలో అమ్మవారి ఆలయంలోకి వేంచేసి కుంభస్థాపన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. పూజా విధానాలు వేద మంత్రోచ్చారణల మధ్య శాంతియుత వాతావరణంలో సాగాయి. రానున్న మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం కలిగించేలా ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, అర్చకులు ఏర్పాట్లు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజల్లో పాల్గొన్నారు.

# సెయింట్ థామస్ అల్టి ట్యూడ్ హైస్కూల్లో ఘనంగా విజయ్ దివాస్ సంబరాలు

**పాఠశాల కరస్పెండెంట్ పుస్కూరి కార్తీక్ రావు**





**ఎల్కతుర్తి డిసెంబర్ 16 (ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హైస్కూల్ ప్రాంగణంలో విజయ్ దివాస్ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు దేశభక్తి భావాలను ప్రతిబింబించేలా విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలను మరింత వైభవోపేతంగా తీర్చిదిద్దారు. వేడుకల ప్రారంభంలో విద్యార్థులు సమిష్టిగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం దేశభక్తి గీతాలు, నృత్యాలు, వక్తృత్వ పోటీలు నిర్వహించగా, విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుని దేశభక్తి భావాలను రగిలించాయి.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, విజయ్ దివాస్ ప్రాధాన్యతను వివరించారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగాలు చేసిన వీరుల సాహసం, త్యాగాలు యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థులు దేశభక్తి, కర్తవ్యనిష్ఠతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నవీన్, వైస్ ప్రిన్సిపల్ మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రే తిరుపతి, ఉపాధ్యాయులు ఆశా బేగం, సురేష్, రమేష్, సరిత, లావణ్య, మమతా, కవిత, శ్వేత, కావ్య, అనుష, స్వప్న, రమ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల సమన్వయంతో విజయ్ దివాస్ వేడుకలు అత్యంత స్ఫూర్తిదాయకంగా ముగిశాయి.

# శ్రీవారి భక్తులకు అలర్ట్ - మార్చి నెల దర్శన టికెట్ల కోటా వచ్చేస్తోంది!

**18 నుంచి ఆన్‌లైన్‌లో శ్రీవారి ఆర్జిత సేవలు**

**తిరుమలలో మొదలైన ధనుర్మాస శోభ**



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవాలని ఎదురుచూస్తున్న భక్తులకు శుభవార్త. 2026 మార్చి నెలకు సంబంధించిన దర్శన టికెట్ల కోటాను విడుదల చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమైంది. ఈ నెల 18 నుంచి వరుసగా వివిధ రకాల సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనుంది. మరోవైపు తిరుమల కొండపై ఆధ్యాత్మిక వాతావరణం కొత్త శోభను సంతరించుకుంది. పవిత్రమైన ధనుర్మాసం ప్రారంభం కావడంతో ఆలయ సేవలలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. రేపు శ్రీవారికి సుప్రభాత సేవ రద్దు కానుంది.టికెట్ల విడుదల షెడ్యూల్ ఇదే: శ్రీవారి దర్శనం కోసం భక్తులు ముందుగానే ప్లాన్ చేసుకునేలా టీటీడీ షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 2026 నెలకు సంబంధించిన కోటా వివరాలు ఇలా ఉన్నాయి. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ప్రధాన ఆర్జిత సేవల టికెట్లను ఈ నెల 18న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వీటి కోసం భక్తులు ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ లక్కీడిప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ రిజిస్ట్రేషన్ గడువు డిసెంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఉంటుంది. ఆ తర్వాత లక్కీ డిప్ తీసి టికెట్లు కేటాయిస్తారు.డిసెంబర్ 22వ తేదిన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ టికెట్లను ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను విడుదల చేస్తారు. మార్చిలో జరగనున్న సాలకట్ల తెప్పోత్సవాలు, సాలకట్ల వసంతోత్సవాల టికెట్లు కూడా ఇదే రోజున అందుబాటులోకి వస్తాయి.డిసెంబర్ 23వ తేదిన ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా విడుదలవుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. డిసెంబర్ 24న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను అందుబాటులో ఉంచుతారు. భక్తులు దళారులను నమ్మి మోసపోవద్దని, కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.ప్రత్యేక నైవేద్యాలు, అలంకరణలు: ధనుర్మాసం సందర్భంగా స్వామివారికి బిల్వ పత్రాలతో సహస్ర నామార్చన నిర్వహిస్తారు. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన చిలుకలతో స్వామివారిని రోజూ అలంకరిస్తారు. స్వామివారికి నివేదించే ప్రసాదాలు కూడా ప్రత్యేకంగా ఉంటాయి. బెల్లం దోశ, సుండలు, సీరా, పొంగల్ వంటి రుచికరమైన నైవేద్యాలను సమర్పిస్తారు. ఏకాంత సేవలో భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామివారిని ఊయలలో పవళింపజేస్తారు.తిరుమల అన్నమయ్య భవనంలో నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరగనుంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుంది. దాదాపు 60 కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా జనవరిలో రానున్న వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనాలకు వచ్చే భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై ప్రధానంగా చర్చించనున్నారు. అలాగే 100 ఎకరాల్లో 'దివ్యవృక్షాల ప్రాజెక్టు'కు ఈ సమావేశంలో ఆమోదం తెలిపే అవకాశం ఉందని సమాచారం. భక్తుల సౌకర్యాలు, అభివృద్ధి పనులపై కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది.

# గుడివాడ పోలీసుల అదుపులో అర్జున్‌రెడ్డి

**అనుచిత పోస్టుల కేసులో గతంలో లుక్‌అవుట్ నోటీస్‌లు**

**వైఎస్సార్సీపీ సోషల్ మీడియాలో సజ్జల భార్గవ్‌రెడ్డితో కలిసి కీలకంగా పని చేసిన అర్జున్‌రెడ్డి**

**గత ఏడాది నవంబర్‌లో గుడివాడలో కేసు నమోదు**



వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమీప బంధువు అర్జున్‌రెడ్డిని శంషాబాద్ విమానాశ్రయంలో గుడివాడ పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వైఎస్సార్సీపీ సామాజిక మాధ్యమ విభాగంలో సజ్జల భార్గవ్‌రెడ్డితో కలిసి అర్జున్‌రెడ్డి క్రియాశీలకంగా పని చేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, వారి కుటుంబ సభ్యుల చిత్రాలను అసభ్యంగా మార్ఫింగ్ చేసి, వైఎస్సార్సీపీ సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా వ్యాప్తి చేస్తున్నారంటూ గత ఏడాది నవంబరులో అతనిపై గుడివాడలో కేసు నమోదైంది.గతంలోనే అతన్ని అరెస్టు చేసేందుకు పోలీసులు యత్నించగా, అంతలోనే విదేశాలకు పారిపోయాడు. తర్వాత పోలీసులు లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశారు. అర్జున్‌రెడ్డి విదేశాల నుంచి తిరిగి రావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుని గుడివాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏపీ నుంచి వెళ్లిన బృందాలు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతనికి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసులు అందజేశాయి. అయితే, అర్జున్‌రెడ్డి అప్పటికే తన న్యాయవాదుల్ని ఎయిర్‌పోర్టుకు రప్పించుకున్నారు. అతని పై ఉమ్మడి కడప సహా పలు జిల్లాల్లో కేసులు ఉన్నాయి.వివేకా హత్య కేసులోనూ: వైఎస్ జగన్‌కు బాబాయ్ వరుసయ్యే వైఎస్ ప్రకాశ్‌రెడ్డి మనవడే అర్జున్‌రెడ్డి. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో రెండో నిందితుడైన సునీల్‌యాదవ్ సోదరుడు కిరణ్‌యాదవ్, అర్జున్‌రెడ్డిల మధ్య వివేకా హత్య జరిగిన రోజు రాత్రి ఫోన్ సంభాషణలు జరిగినట్లు అభియోగాలు ఉన్నాయి. దీని పై దర్యాప్తు చేసి, అనుబంధ ఛార్జిషీట్ వేయాలని హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టు ఇటీవల సీబీఐని ఆదేశించింది.కడప ఎయిర్‌పోర్టులో మరో కార్యకర్త: ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైఎస్సార్సీపీ కార్యకర్త బత్తల శ్రీనివాసులురెడ్డిని కడప విమానాశ్రయంలో సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బద్వేలుకు చెందిన శ్రీనివాసులురెడ్డి వైఎస్సార్సీపీ సామాజిక మాధ్యమ కార్యకర్తగా పని చేసే వారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గల్ఫ్‌కు పారిపోయాడు. తిరిగి రాగా, కడప ఎయిర్‌పోర్టులో పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. గతేడాది నవంబరులో ఫిర్యాదు: ఇదిలా ఉండగా మరోవైపు సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో వైఎస్సార్సీపీ నేత సజ్జల భార్గవ్‌రెడ్డి పోలీస్ విచారించారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై సజ్జల భార్గవరెడ్డి, వైఎస్సార్సీపీ నేత పర్వతం సుధాకర్ రెడ్డిలు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టారు. ఈ వ్యవహారంపై టీడీపీ నేత గత ఏడాది నవంబరులో తమకు ఫిర్యాదు చేశారని మంగళగిరి గ్రామీణ సీఐ శ్రీనివాసరావు చెప్పారు.ఈ మేరకు విచారణకు రావాలని మంగళగిరి పోలీసులు నోటీసులు జారీ చేశారు. గత కొద్దిరోజుల క్రితం మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్లలో సజ్జల భార్గవ్‌రెడ్డి పోలీసులు ఎదుట విచారణకు సైతం హాజరుయ్యారు. సుమారు గంటన్నర పాటు సజ్జల భార్గవరెడ్డిని పోలీసులు విచారించారు. దాదాపు 22 ప్రశ్నలు సంధించారు. అన్ని ప్రశ్నలకు దాటవేత సమాధానం ఇచ్చినట్లు సమాచారం.

# తాను సర్పంచిగా గెలిచింది - తన ఓటుతో తండ్రిని ఉప సర్పంచిని చేసింది

**డిసెంబర్ 17న జరగనున్న మూడో విడత ఎన్నికలు**

**182 మండలాల్లో 3,752 గ్రామ పంచాయతీల్లో ఉదయం**

**7 నుంచి మధ్యాహ్నం 1 వరకు జరగనున్న పోలింగ్**




తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో ఇప్పటి వరకు ప్రచారం, గెలుపోటముల్లో ఒకే కుటుంబానికి చెందిన వారి మధ్య విబేధాలు ఏర్పాడ్డాయి. నేనంటే - నేనని పోటీకి దిగారు. కొన్నిచోట్ల వివాదాలు కూడా జరిగాయి. కానీ ఆ గ్రామంలో పరిస్థితి వేరు. ఆ పల్లెలో సర్పంచి ఎన్నికల్లో తండ్రి, కుమార్తెలు అధికార పీఠాలను దక్కించుకున్నారు. ఇద్దరి పార్టీలు వేరైనా, రక్తబంధానికే ప్రాముఖ్యతను ఇచ్చుకున్నారు. జనగామ మండలం వెంకిర్యాల గ్రామ సర్పంచిగా కుమార్తె గొల్లపల్లి అలేఖ్య, ఉప సర్పంచిగా తండ్రి గొల్లపల్లి పర్శయ్య ఎన్నికయ్యారు.అలేఖ్యకు అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహమైంది. భర్త ప్రోద్బలంతో బీజేపీకి మద్దతు పలుకుతూ ఆమె సర్పంచి బరిలో నిలిచింది. గ్రామంలో మొత్తం 10 వార్డులున్నాయి. అందులో 8 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు. పర్శయ్య బీఆర్ఎస్ పార్టీ తరపున వార్డు సభ్యునిగా పోటీ చేశారు. మరో 2 వార్డులను బీఆర్ఎస్ రెబెల్ అభ్యర్థులు గెలుచుకున్నారు.పర్శయ్యతో పాటు మరో అభ్యర్థి ఉప సర్పంచి పదవికి పట్టుబట్టారు. వార్డు సభ్యులు వారి మద్దతును తెలుపుతూ ఓట్లు వేశారు. అందులో ఇద్దరికీ సమానంగా ఓట్లు వచ్చాయి. అయితే అక్కడ సర్పంచి నిర్ణయం చాలా కీలకమైంది. దాంతో అలేఖ్య తన తండ్రి పర్శయ్యకు మద్దతు పలకడంతో ఆయన ఉప సర్పంచిగా ఎన్నికయ్యారు.కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని చాకలివానిపల్లి గ్రామంలో తల్లీ, కుమారుడు సర్పంచి, వార్డు మెంబర్‌గా పోటీ చేశారు. 5వ వార్డులో పోటీ చేసిన కుమారుడు బాబు 16 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న తల్లి రేపాక బానవ్వ(70) సర్పంచిగా ఎన్నికయ్యారు. ఆ గ్రామంలో నలుగురు అభ్యర్థులు బరిలో ఉండగా, 393 ఓట్లు పోల్ అయ్యాయి. బానవ్వ 5 ఓట్ల తేడాతో విజయం సాధించారు.నాడు అదే గ్రామంలో తండ్రుల మధ్య రసవత్తరమైన పోటీ ఉండేది. కానీ ఆ పోరు ఇప్పుడు కుమార్తెల మధ్య మొదలైంది. నల్గొండ జిల్లా దేవరకొండ మండలంలోని కొర్రతండా గ్రామ పంచాయతీ సర్పంచి పదవి ఎస్టీ మహిళకు రిజర్వ్ అయ్యింది. గతంలో పోటీ చేసిన వారి కుమార్తెలే ఇప్పుడు ప్రధాన ప్రత్యర్థులయ్యారు. గత సర్పంచి ఎన్నికల్లో రాత్లావత్ నర్యానాయక్, కొర్ర చందూనాయక్ పోటీ చేశారు. గతంలో సర్పంచిగా పని చేసిన నర్యా నాయక్ రెండోసారి విజయం సాధించారు.మూడో విడతలో ఇక్కడ ఎన్నికలు జరగనున్నాయి. చందూనాయక్ కుమార్తె కొర్ర అఖిల బీఆర్ఎస్ పార్టీకి మద్దతు పలుకుతూ సర్పంచి పదవికి పోటీ పడుతున్నారు. ఈమె హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. నర్యానాయక్ కుమార్తె రాత్లావత్ సంధ్య బరిలో నిలిచారు. నామినేషన్ సమయానికి సంధ్య గర్భిణి. వారం రోజుల కిందట మగబిడ్డకు జన్మనిచ్చారు. ప్రస్తుతం యధావిధిగా ప్రచారం కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో డిసెంబర్ 17 బుధవారం రోజున మూడో విడత ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ జరగనుంది. 182 మండలాల్లో 3,752 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. 28,406 వార్డులకు 75,283 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మూడో విడతలో 4,157 గ్రామాలు, 36,434 వార్డులకు నోటిఫికేషన్ ఇవ్వగా, 394 గ్రామాలు, 7,916 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి.

# 'ఇజ్జత్ కా సవాల్ - ఎలాగైనా గెలిచి, పరువు నిలబెట్టుకోవాలి'

**మూడో విడతలో ప్రలోభాల పర్వం!**

**ఓట్లు వేయడానికి పలు గ్రామాల్లో**

**మద్యం, నగదు పంపిణీ**

**ఒకరి కంటే ఒకరు ఎక్కువగా**

**ఇవ్వడానికి ప్రయత్నాలు**




తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే రెండు విడతల్లో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు విజయం సాధిస్తున్నారు. రేపు జరిగే మూడో విడతలోనూ ఎలాగైనా గెలవాలని అభ్యర్థులు వివిధ ప్రయత్నాలు చేస్తున్నారు. 'ఇజ్జత్ కా సవాల్. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలి. పరువు నిలబెట్టుకోవాలి' అనుకుంటూ పంచాయతీ ఎన్నికలను చాలా సీరియస్‌గా తీసుకుంటున్నారు. అందుకోసం గుట్టుగా ఉంచిన మద్యం, నగదు, ఇతర పంపకాలు మొదలుపెట్టేశారు. ఈ నెల 17న (బుధవారం రోజున) మూడో విడత ఎన్నికలు మెదక్ జిల్లాలోని 9 మండల్లాలో జరగనున్నాయి.పంచాయతీ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఇప్పటికే రెండు విడతల్లో ఎన్నికలు జరిగాయి. గెలవాలనే ఉత్సుకత అభ్యర్థిల్లోనూ పెరిగిపోతుంది. దానికితోడు ఓట్లు వేసేందుకు ఇక కొన్ని గంటల సమయమే మిగిలి ఉండటంతో గ్రామాల్లో కొందరు అభ్యర్థులు ఓటర్లను కలుస్తున్నారు. ఓట్లు తమకే వేయాలంటూ ప్రలోభానికి గురి చేస్తున్నారు. అందుకోసం మద్యం, డబ్బు, ఇతర కానుకలను ఓటర్లకు అందిస్తున్నారు. ఇవి ఇస్తే ఓట్లు తమకే పడతాయని ఆశపడుతున్నారు.కొందరు ఇంటింటికి వెళ్లి పంచితే, మరికొందరు ఒక్కొక్క ఇంట్లో కలిసేందుకు వీలులేని చోట కుల, యువజన సంఘాల ప్రతినిధులను కలిసి క్రీడా, వంటకు సంబంధించిన సామగ్రిని పంచుతున్నారు. ఓటున్న సభ్యులను తమకే ఓటు వేయాలని అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు.అధికార పార్టీ అభ్యర్థులు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని నమ్ముకుని ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ అధికారంలోని పార్టీ చేసిన వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. మూడు వారాల పాటు గ్రామాల్లో నాయకులు ప్రచారాన్ని హోరెత్తించారు.మద్దూరు, కొమురవెల్లి, ధూల్మిట్ట, చేర్యాల మండలాల్లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్ని గ్రామాల్లో ప్రచారం చేశారు. కుకునూరుపల్లి, కొండపాక మండలాల్లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి చేపట్టారు. కానీ ఎన్నికలను కొందరు అభ్యర్థులు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఓటర్లకు ఇప్పటికీ నగదు ఇస్తున్నారు.ఎన్నికల్లో ఓటు తమకే వేయడానికి ఏది కావాలో కోరుకోమన్నట్టుగా చికెన్ లేక స్వీట్సు అని ఓటర్లకు ఆఫర్లు ఇస్తున్నారు. చాలా మంది అభ్యర్థులు ఇంటింటికీ కిలో చికెన్ పంపిణీ చేస్తున్నారు. వద్దన్న వారికి మిఠాయి డబ్బా ఇస్తున్నారు. హుస్నాబాద్ మండలంలోని కొన్ని గ్రామాల్లో ఓటర్లకు రూ.500 నుంచి రూ.2 వేల వరకు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.కోహెడ మండలంలోని గ్రామాల్లో అభ్యర్థులు నూనె ప్యాకెట్లు, నగదు పంచుతున్నారు. కుకునూరుపల్లి, కొండపాకలోని కొన్ని గ్రామాల్లో హ్యాండ్‌బ్యాగులు, మద్యం, నగదు పంపిణీ చేస్తున్నారు. విజయం సాధించడానికి చివరి వరకు ప్రయత్నిస్తున్నారు. ఎదుటి వర్గం ఏమేమి పంపిణీ చేస్తున్నారో తెలుసుకొని, మరికొందరు ఆరా తీసి అంతకన్నా ఎక్కువగా ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. కొమురవెల్లి, కొండపాక, కుకునూరుపల్లి, మద్దూరు, కోహెడ, చేర్యాల, ధూల్మిట్ట, హుస్నాబాద్ వంటి మండలాల్లో మూడో విడత ఎన్నికలు డిసెంబర్ 17న జరగనున్నాయి.

# స్పష్టమైన వ్యూహంతోనే వైద్యరంగంలో ఏఐ

**దక్షిణ భారత ప్రాంతీయ వర్క్‌షాప్‌లో నిపుణుల వెల్లడి**

**భవిష్యత్తులో ఆరోగ్య రంగంపై కృత్రిమ మేధ ప్రభావం**

**ఫిబ్రవరిలో ముసాయిదా రూపొందించనున్న కేంద్రం, డిజిటల్**

**కమ్యూనికేషన్ సేవలు అందరికీ చేరేలా బలోపేతం**



భవిష్యత్తులో ఆరోగ్య రంగంపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం చూపుతుంది. ఈ సాంకేతికతను ఎలా వినియోగించుకోవాలో స్పష్టమైన వ్యూహం లేకపోతే దానివల్ల లభించే ప్రయోజనాలు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆగ్నేయాసియా ప్రాంతీయ సలహాదారు డాక్టర్ కార్తీక్ అడపా అన్నారు.ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై విజయవాడలో నిర్వహించినటువంటి దక్షిణ భారతదేశ బహుళ భాగస్వామ్య సమన్వయ ప్రాంతీయ కార్యశాలలో ఆగ్నేయాసియా ప్రాంతీయ సలహాదారు డాక్టర్ కార్తీక్ అడపా ప్రసంగించారు. భారత ప్రభుత్వం ఆరోగ్య రంగంలో ఏఐ వ్యూహాన్ని రూపొందిస్తోందనీ, అందుకు సరైన ఆలోచనల కోసం రీజియన్ల వారీగా సదస్సులను నిర్వహిస్తోందని తెలిపారు. నేషనల్ హెల్త్ అథారిటీ అదనపు సీఈవో, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) ఎండీ కిరణ్ గోపాల్ మాట్లాడుతూ రోగ నిర్ధరణ, క్లినికల్ నిర్ణయాలు, చికిత్స, ఆరోగ్య సంరక్షణ సామర్థ్యం పెంచితే ఫలితాలు అందుతాయని వెల్లడించారు.ఆరోగ్య రంగంలో డిజిటల్ కమ్యూనికేషన్ సేవలు: భారత వైద్య పరిశోధన మండలి– డిజిటల్ హెల్త్ అండ్ డేటా సైన్స్ పరిశోధన జాతీయ సంస్థ (ఐసీఎంఆర్– ఎన్ఐఆర్‌డీహెచ్‌డీఎస్) ప్రతినిధి డాక్టర్ మోనా దుగ్గల్ మాట్లాడుతూ దేశంలో ఎదురవుతున్న సవాళ్లను సరైన వ్యూహాలు, పాలసీలు, టెక్నాలజీ వినియోగం ద్వారా అధిగమించవచ్చన్నారు. ఆరోగ్య రంగంలో డిజిటల్ కమ్యూనికేషన్ సేవలు చివరి వ్యక్తి వరకు చేరేలా వ్యవస్థను బలోపేతం చేయాల్సి ఉందని పేర్కొన్నారు.వ్యూహాన్ని ఖరారు చేస్తామని వెల్లడి: ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ రాష్ట్ర కార్యదర్శి సౌరభ్ గౌర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఏఐ ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం ఖరారు చేస్తుందన్నారు. ఈ ముసాయిదా ఆధారంగా రాష్ట్రాల స్థాయిలో విడిగా ఆరోగ్య రంగంలో ఏఐ అమలు వ్యూహాన్ని ఖరారు చేస్తామని అధికారులు తెలియజేశారు. అదే విధంగా వైద్యారోగ్య శాఖ కమిషనర్ జి. వీరపాండియన్ మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై జాతీయ స్థాయిలో విధానాలను రూపొందించడానికి దేశంలో తొలిసారిగా ఏపీలో కార్యశాల ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు: వైద్యారోగ్యశాఖ అదనపు చీఫ్ సెక్రటరీ సెంథిల్‌కుమార్, అశోకా యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ అనురాగ్ అగర్వాల్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ గిరీష, ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవో దినేశ్‌కుమార్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధరబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.కేంద్రప్రభుత్వానికి నివేదిక: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, కేరళ, అండమాన్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరి నుంచి వైద్యారోగ్య, ఐటీ కార్యదర్శులు, జాతీయ ఆరోగ్య మిషన్ ప్రతినిధులు వర్క్‌షాప్‌నకు హాజరయ్యారు.ముఖ్యంగా గోదావరి, కృష్ణ, పెన్నా, తుంగభద్ర, వంశధార బృందాలుగా విడిపోయి సమాచారం, డిజిటల్ మౌలిక సదుపాయాలు, పరిపాలన, నైతికత, విధానాలు, సిబ్బంది, సామర్థ్యం, ఆరోగ్య వ్యవస్థల సమగ్రత, ప్రభావం అంశాలపై చర్చించారు. ఈ సమాచారాన్ని అంతా క్రోడీకరించిన అనంతరం సమగ్ర నివేదికను రూపొందించారు. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు.గుంటూరులో జీజీహెచ్‌లో ఏఐ సేవలు: కృత్రిమ మేధ ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ సమూలమైన మార్పులను తెస్తున్నసాంకేతిక విప్లవం. వైద్యరంగంలోనూ అద్భుత ఫలితాలు ఆవిష్కరిస్తున్న ఏఐ సేవలను కొన్ని నెలల క్రితమే గుంటూరు జీజీహెచ్(జీజీహెచ్) అందిపుచ్చుకుంది. జీజీహెచ్ క్యాన్సర్ సెంటర్‌లో రోగులకు మెరుగైన, కచ్చితత్వంతో కూడిన వైద్యం అందించనుంది.ఏఐ సేవల వల్ల ఇక క్యాన్సర్‌ను ప్రారంభంలోనే గుర్తించడంతో పాటు అత్యుత్తమ విధానాలతో చికిత్సకు వీలుటుంది. మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు పరిసర జిల్లాల నుంచీ క్యాన్సర్ చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు వస్తుంటారు. వారికి నాట్కో కేంద్రంలో ఉచితంగానే వైద్యం అందిస్తున్నారు. ఇందుకోసం ఇక్కడ అధునాత మౌలిక సదుపాయాలతో 110 పడకలు, ఐసీయూ విభాగం అందుబాటులో ఉంది.

# మీ ఆధార్ అప్‌డేట్ చేసుకున్నారా

**ఈ ప్రాబ్లమ్స్ రావొచ్చు ముందే జాగ్రత్తపడండి!**

**ప్రభుత్వ పథకాలు, ధ్రువపత్రాలు కావాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డు**

**ప్రతి 15 ఏళ్లకు అప్‌డేట్ చేసుకోవాల్సిందేనని సూచిస్తున్న ఉడాయ్**

**ఆధార్ అప్‌డేట్ చేసుకోకపోవడంతో తలెత్తుతున్న ఇబ్బందులు**



ప్రభుత్వ పథకాలు, ధ్రువపత్రాలు, స్కాలర్‌షిప్‌లు ఇతరత్రా ఏవైనా పొందాలంటే ఆధార్ కార్డు పాత్ర కీలకమైంది. చిన్నప్పుడే ఆధార్ కార్డు తీసుకున్నా, ప్రతి ఐదేళ్లకు, 15 ఏళ్లకు అప్‌డేట్ చేసుకోవాలి. కొందరు నవీకరణ చేసుకోకపోవడంతో పలు ఇబ్బందులు తలెత్తున్నాయి. ఐదేళ్లు దాటి 15 సంవత్సరాలలోపు పిల్లల ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ సూచించింది.హైదరాబాద్‌కు చెందిన ఓ యువతి కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో చదువుతోంది. 2026లో జరిగే జేఈఈ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు తనకు సమీపంలోని మీ–సేవకు వెళ్లగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. అనంతరం ఆధార్ కేంద్రానికి వెళ్లి అప్‌డేట్ చేయించుకొని అప్లై చేసుకోవాల్సి వచ్చింది.హయత్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు తన స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసేందుకు వెళ్లగా ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ అప్‌డేట్ చేయించుకొని దరఖాస్తు చేయాల్సి వచ్చింది.అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకిచ్చే దాన్ని బాల ఆధార్ అని వ్యవహరిస్తారు. ఇందులో చిన్నారుల ఫొటో, పేరు, పుట్టిన తేదీ మాత్రమే ఉంటాయి. పిల్లల వేలిముద్రలు, ఐరిస్ వంటివి తీసుకోరు. తల్లిదండ్రుల వివరాలతోనే ఆధార్‌ను జారీ చేస్తారు. ఐదేళ్ల తర్వాత ఫింగర్ ప్రింట్స్, ఐరిస్‌తో బయోమెట్రిక్ వేసి అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ సంస్థ(భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ) సూచించింది.ఐదేళ్ల కన్నా తక్కువ వయసున్న పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్ చేసి ఉంటే, ఐదేళ్ల వయసు దాటిన తర్వాత రీ రిజిస్ట్రేషన్ చేయించాలి. దీన్ని మ్యాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ) అంటారు. ఇది మొదటి బయోమెట్రిక్ అప్‌డేట్. ఈ సమయంలో వ్యక్తి పూర్తి బయోడేటాను సమర్పించాలి. ఇది కొత్తదే. కానీ పిల్లల ఆధార్ నంబరులో ఎలాంటి మార్పుగానీ ఉండదు. పిల్లల ఆధార్ తప్పనిసరి అని ఆధార్ రెగ్యులేషన్స్ 2016 చట్టం తెలియజేస్తుంది.పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయకపోతే నంబరు డీయాక్టివేట్ అవుతుంది. ఐదేళ్లు దాటిన చిన్నారుల ఆధార్ అప్‌డేట్ రెండేళ్లలోపు చేయించాలి. లేదంటే వారికి ఏడేళ్ల వయసు నిండేలోపు పూర్తి చేయాలి.పిల్లలకు తొలిసారి ఆధార్ తీసుకుంటున్నప్పుడు పుట్టినరోజు డాక్టర్లు ఇచ్చే సర్టిఫికేట్, తల్లిదండ్రుల్లో ఒకరి ఆధార్ కార్డు అవసరం పడుతుంది. ఐదేళ్లలోపు వారిని ఆధార్ కేంద్రాలకు తీసుకెళ్లాల్సిన పనిలేదు. కానీ బయోమెట్రిక్ సమయంలో మాత్రం తప్పనిసరిగా తీసుకువెళ్లాలి. మళ్లీ 15 ఏళ్ల తర్వాత ఆధార్‌ను అప్‌డేట్ చేయించాలి. ప్రస్తుతం 17ఏళ్ల లోపు పిల్లలు ఉచితంగా అప్‌డేట్ చేసుకునే అవకాశం ఉంది.ఉడాయ్ నుంచి ఎంఆధార్ పేరిట ఓ యాప్ అందుబాటులో ఉంది. దీనికి అదనంగా మరో కొత్త యాప్‌ను తీసుకొచ్చారు. ఎం ఆధార్ తరహాలో దీంట్లో డిజిటల్ కార్డు డౌన్‌లోడ్, పీవీసీ కార్డు కోసం ఆర్డర్ చేయడం, ఈ–మెయిల్, మొబైల్ నంబర్ వెరిఫికేషన్, వర్చువల్ ఐడీ జనరేషన్ వంటి ఫీచర్లు ఏవీ ఉండవు. కేవలం మీ ఆధార్ వివరాలను భద్రపరుచుకోవడం, ఇతరులతో పంచుకోవడానికి కోసం మాత్రమే ఈ యాప్‌ను తీసుకొచ్చారు.ఆధార్ కార్డును ప్రతిసారీ వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా డిజిటల్‌గా అందుబాటులో ఉంచుకోవడానికి కొత్త ఆధార్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. కుటుంబసభ్యుల ఆధార్ వివరాలన్నీ ఒకే డివైజ్‌లో సులభంగా పొందుపరచొచ్చు. ఫేస్ అథంటికేషన్ ఫీచర్ కూడా ఇందులో ఉంది. మీ కార్డు వివరాలను ఎవరితోనైనా షేర్ చేసుకోవాలన్నా, ఈ యాప్ ద్వారా అత్యంత సులువు. ఆధార్‌లోని ఏయే వివరాలు పంచుకోవాలనుకుంటున్నారో వాటిని మాత్రమే ఎంపిక చేసుకునే సదుపాయం కూడా ఉంది. ఆధార్ బయోమెట్రిక్ వివరాలను లాక్, అన్‌లాక్ చేసుకునే వెసులుబాటూ ఉంది. మీ ఆధార్ వివరాలను చివరిసారిగా ఎక్కడ వినియోగించారనే విషయాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com